మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన



బంట్వారం ఆగస్టు 13: మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టీఎస్ఎంఎస్‌టీఎఫ్ నాయకుడు కొండయ్య మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా బదిలీలు లేవని, వెంటనే మోడల్ స్కూల్ సిబ్బందికి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు చెల్లించాలన్నారు. దీంతో పాటు 317 జీవో అమలు చేసి తమకు సరైన న్యాయం చేయాలని వారు కోరారు. ఈనెల 21న హైదరాబాదులో నిర్వహించే నిరసన కార్యక్రమానికి వివిధ ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాలని అదేవిధంగా మోడల్ స్కూల్ ఉపాధ్యా యులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీకాంత్ కులకర్ణి, గోపాలకృష్ణ, సంతోష్, దీపక్, అన్నపూర్ణ, స్వప్న, కల్పన, పుష్ప సతీష్ పాల్గొన్నారు

పట్లూరు పాఠశాల పరిశుభ్రం..

మర్పల్లి, ఆగస్టు 13 : 'పారిశుధ్యం...అస్తవ్యస్తం' అనే శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రిక లో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని పట్లూర్ పాఠశాల మెయిన్ గేట్ పక్కన, పాఠశాల గది వెనుకాల పెరిగిన కలుపు మొక్కలను పంచాయతీ కార్యదర్శి గోపాల్ కార్మికులతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ పాఠశాలకు అటెండర్ ఉన్నాడని, అలాగే పంచాయతీ నుంచి ఒకరిని నియమించామని వారే పారిశుధ్య పనులు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పాఠశాల వెనుకాల శుభ్రం చేయించినందుకు విద్యార్థులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు..

కులకచర్ల, ఆగస్టు 13: హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీకి మండలం నుంచి నాయకులు బయలుదేరి వెళ్లారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్, అధికార ప్రతినిధి మొగులయ్య, కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మండల దళిత సంఘం, బ్లాక్ బి అధ్యక్షుడు కర్రె భరత్ కుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, జెండా ఊపి ర్యాలీ ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షుడు వెంకట్రాములు, మాజీ అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు నర్సింహులు, ఎల్లయ్య, వెంకటయ్య, బందయ్య, బిచ్చయ్య, రాములు, బాబు, అరవింద్, వెంకట్రాములు, భీమ్ సేన్, యాదగిరి, వెంకట్, బాను, ప్రేమ్, అంజి, కరుణాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ నారాయణకు సన్మానం

పెద్దేముల్, ఆగస్టు 13: పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల బదిలీ పై వెళ్లిన ఏఎస్ఐ నారాయణను మంగళవారం ఎస్ఐ కె. గిరి సిబ్బందితో కలిసి సన్మానించి వీడ్కో లు పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో బదిలీ సర్వ సాధారణమన్నారు. ఏఎస్ఐగా నారాయణ మూడు సంవత్సరాల నుంచి పోలీసు ఉన్నతాధికారుల, పెద్దేముల్ మండల ప్రజల మన్ననలను పొందారన్నారు.కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు సెల్ ఫోన్లు అప్పగింత

ధారూరు, ఆగస్టు 13: మార్కెట్లో చోరీకి గురైన మొబైల్ ఫోన్ ను సీఈఐఆర్ ఆధారంగా గుర్తించి బాధితులకు అప్పగించినట్లు ధారూరు ఎస్సై వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గురుదట్ల గ్రామానికి చెందిన మొగిలి నర్సింహులు, వికారాబాద్ మండల పరిధిలోని మదన్ పల్లి గ్రామానికి చెందిన శశికలారెడ్డి చోరికి గురైన మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ ద్వారా గుర్తించి బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రతివారం నిర్వహించే సంతలో వరుసగా మొబైల్ ఫోన్‌లు చోరీకి గురవుతున్నాయని, అందుకు గస్తీని పెంచి దొంగతనాలు జరగకుండా చూస్తామన్నారు. మార్కెట్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీస్ వారికి తెలియజేయాలన్నారు.

స్వచ్ఛందంగా బంద్

హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పరిగిలో ర్యాలీ

పరిగి, ఆగస్టు 13: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ మంగళవారం పరిగి బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని దుకాణాలు మూసి వేశారు. పట్టణ హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని కొడంగల్ క్రాస్‌రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్, బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి బూనేటి మారుతీ కిరణ్, వివిధ పార్టీల నాయకులు బి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పెంటయ్యగుప్తా, హన్మంతు, చిన్న నర్సింహ, హిందూ ఉత్సవ సమితి నాయకుడు నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: హిందూ వాహని పిలుపు మేరకు పట్టణంలో స్వచ్ఛందంగా బంద్ పాటించారు. స్థానిక శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని సభ్యులతో పాటు వ్యాపారస్తులు, ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట: పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, అకృత్యాలకు నిరసనగా హిందూ సంఘాలు మంగళవారం బొంరాస్‌పేటలో బంద్ నిర్వహించారు. హిందూ సంఘాల నాయకులు, యువకులు భక్త సమాజం నుంచి ర్యాలీగా బయలుదేరి గ్రామంలోని కిరాణా దుకాణాలు, హోటళ్లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలను మూసి వేయించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. హిందు సమాజం ఐకమత్యంగా ఉండి దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

నవాబుపేట: నవాబుపేటలో భారీగా ర్యాలీ నిర్వహించారు. హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. బంద్ సందర్భంగా దుకాణాలు విద్యాసంస్థలు, మూతపడ్డాయి.

కొడంగల్ పట్టణంలో...

ప్రతి వార్డులో సమగ్రాభివృద్ధి

పరిగి, ఆగస్టు 13 : ప్రతి వార్డు పరిధిలో సమగ్ర అభివృద్ధి చేపట్టడం జరుగుతుందని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ తెలిపారు. మంగళవారం పరిగి మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదచారులు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా సీసీ పనులు చేయించడం జరిగిందని తెలిపారు. ప్రతి వార్డు పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మీర్ తాహెర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

విద్యార్థులకు కిట్స్ అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ చంద్రయ్య

పరిగి, ఆగస్టు 13 : విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని పరిగి మాజీ జడ్పీటీసీ పి.చంద్రయ్య పేర్కొన్నారు. మంగళవారం పరిగి మండలం జాఫర్‌పల్లిలోని ప్రాథమిక పాఠశాలలో అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, మ్యాట్‌లు, చెప్పులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కిట్స్ అందించడం అభినందనీయమని అన్నారు. గ్రామీణ పేద విద్యార్థులకు అండగా ఉంటూ ఇలాంటి సహాయ కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి లాల్‌క్రిష్ణప్రసాద్, సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రకాష్, మాజీ ఉపసర్పంచ్ మహేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

108 మందికి ఉచిత క్యాన్సర్ పరీక్షలు

ధారూరు, ఆగస్టు 13: ఇండియన్ క్యాన్సర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్ స్కా నింగ్‌కు విశేష స్పందన లభించిందని ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ నిరోషా పేర్కొన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్ ఆదేశాను సారం ధారూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ స్కానింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో 108 మంది వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించు కున్నారు.వీరిలో నలుగురు పురుషులు, ఇద్దరు స్త్రీలలో క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల కొరకు హైదరాబాద్ నగరంలోని ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ స్వాతి, డాక్టర్ విద్య, డిప్యూటీ డీఈఎంవో శ్రీనివాసులు, వేణుకుమార్, ఎన్‌సీడీ కోఆర్డినేటర్, డీపీహెచ్ఎన్‌వో చండీశ్వరి, రజిత తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి, ఆగస్టు 13 : మర్పల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించి తాండూరు పీఎస్ కు బదిలీపై వెళ్లిన హెడ్ కానిస్టేబుల్ రామచందర్‌కు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేశ్ పూలమాల శాలువతో సన్మానించారు. ప్రతి ఉద్యోగికి బదిలీలు తప్పనిసరన్నారు. ప్రజలకు మంచి సేవలు అందిస్తే అందరి మన్ననలు పొందుతారన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజీబీఎస్‌లో ఆకస్మిక తనిఖీలు

ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి

సుల్తాన్‌బజార్, ఆగస్టు 13: దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్టు ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి అన్నారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని అన్ని చోట్ల నిర్వహిస్తున్న సర్‌ప్రైజ్ చెకింగ్‌లో భాగంగా మహాత్మా గాంధీ బస్‌స్టేషన్‌లో కూడా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, సుల్తాన్‌బజార్ డివిజన్ ఏసీపీ శంకర్, అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్ రావు, టీజీఆర్‌టీసీ డిప్యూటీ ఆర్ఎంబి.రాజు, సీఆర్ఎం శ్రీనివాస్, అఫ్జల్‌గంజ్ సీఐ జగదీష్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది మహేశ్, దుర్గేశ్, జనార్దన్‌తో కలిసి ఎంజీబీఎస్‌లోని అన్ని ప్లాట్‌ఫారాలతో పాటు సీసీటీవీ గదిని, కమాండ్ కంట్రోల్, ఔట్ పోస్టు, పార్శిల్ కార్యాలయాలను, వెయింటింగ్ హాల్‌ను, ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముందస్తు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, వస్తువులు కనిపించినా వెంటనే 100 నంబర్‌కు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలను డీసీపీ కోరారు.

నేడు ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

సిటీబ్యూరో, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగ యువత కోసం ఆసిఫ్‌నగర్‌లోని ఉపాధి కార్యాలయంలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధికల్పనాధికారి ఏ. వందన మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలని సూచించారు.

గూడ్స్ ఢీ కొని 40 మేకలు మృతి

ధారూరు, ఆగస్టు 13: గూడ్స్ ఢీకొని సుమారు 40 మేకలు మృతి చెందిన ఘటన ధారూరు స్టేషన్‌లో చోటు చేసుకుంది.మంగళవారం బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి... మండల పరిధిలోని డీకే తండాకు చెందిన చంద్రీ బాయ్, కిష్టి భాయ్ బాలరాజు నాయక్, తేజ నాయక్, లాల్‌సింగ్‌లకు చెం దిన మేకలు సాయంత్రం మండల పరిధిలోని ధారూరు స్టేషన్ సమీపంలోని అటవీ ప్రాంతంలో మేత మేస్తుండగా అడవి పందులు రావడంతో మేకలు భయపడి పారిపోతుండడంతో అదే సమ యం లో గూడ్స్ ఢీకొట్టడంతో మేకలు మృతి చెందాయని బాధితులు తెలిపారు.

పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి



బొంపల్లిలో పెసర పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సంచాలకులు లక్ష్మీకుమారి

దోమ, ఆగస్టు 13 : రైతులు తాము పండించిన పంటలను విధిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పరిగి సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీకుమారి అన్నారు.మంగళవారం మండల పరిధిలోని బొంపల్లి గ్రామాన్ని సందర్శించిన ఆమె రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలు ఏ దశలో ఉన్నాయి, చీడ పీడల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలను రైతులకు ఆమె వివరించారు.అనంతరం రైతులతో సమావేశమైన ఆమె రైతు రుణ మాఫీపై చర్చించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏఈవో గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు టీషర్టులు పంపిణీ

తాండూరు రూరల్, ఆగస్టు 13: తాండూరు మండలం కొత్లాపూర్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. వ్యాపారి మనోహర్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా 65 మంది పేద విద్యార్థులకు టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జొన్నల వినోద్ కుమార్ కాంప్లెక్స్ హెచ్ఎం వైద్యనాథ్, ఏపీసీ చైర్మన్ రేణుక, మహేశ్వరి, మనోహర్, వివేకా నంద్, సృజన్, యువరాజ్ ఉపాధ్యాయులు ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

పూడూరు, ఆగస్టు 13: పూడూరు మండల పరిధిలోని చన్గోముల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు స్వరూప, రాజు, ప్రభాకర్, ఆంజనేయులు, జయంతి, శ్రీనివాస్, షహన్ ఆయా ప్రాంతాలకు బదిలీలపై వెళ్లారు. వీరి స్థానంలో ఆయా జిల్లాల నుంచి ఉపాధ్యాయులు వచ్చినట్లు హెచ్ఎం హనుమంత్ రెడ్డి పేర్కొన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వ హించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన

దోమ, ఆగస్టు 13 : రోడ్డు భద్రతా నియమాలను పాటించడంతో పాటు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై సూర్యనాయణ చారి అన్నారు. మండల కేంద్రంలోని హనుమాన్ కూడలిలో ఆయన పోలీసు బృందంతో కలిసి ప్రయాణికులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా సైబర్ నేరగాళ్లు ఐదు నిమిషాలలో లోన్ మంజూరు చేస్తాం వివరాలు చెప్పమని బ్లూ లింక్‌లను పంపి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. బ్యాంకు ఖాతా పునరుద్ధరిస్తామని, పీఎం కిసాన్,రైతు బంధు డబ్బులు ఖాతాల్లో పడటం లేదంటూ లింక్‌లను పంపి సైబర్ నేరాలకు పాల్పడుతున్న విషయాన్ని గుర్తుంచుకొని బ్లూ లింకుల జోలికి వెల్లవద్దని తెలిపారు.

మర్పల్లి, (మోమిన్ పేట్) ఆగస్టు 13 : నవాబ్‌పేట పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అరుణ్ కుమార్ గౌడ్ మంగళవారం మోమిన్ పేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆంజనే యులును కలిసి స్టేషన్ స్థితిగతులను సీఐ కి వివరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
PLOT FOR SALE
★ కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్; బెంగళూరు హైవేకి అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available,
ఫోన్: 8885731233, 9948033142.
NT- 326218
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి
తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962